

# ఛాయిస్ ఈజ్ యువర్స్

పి.వి. సునీల్‌కుమార్

''సో వాట్స్ యువర్ గుడ్ నేమ్ డియర్?'' అన్నాడు బి.జి.టి. చలసాని తన ఎదురుగా ఉన్న ముప్పై ఏళ్ళ యువకుడితో.

అతడి గొంతులో మార్దవం ఉంది, కమాండ్ ఉంది, కూల్‌నెస్ ఉంది. బి.జి.టి వయసు నలభై ఆరు ఉండొచ్చు. కానీ చూడ్డానికి ముప్పై అయిదు ఏళ్ళ యువకుడిలా ఉంటాడు.

ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ విగ్రహం, ప్రపంచంలో దేన్నీ లెక్క చేయని అతడి చూపు... అతడి ఆస్తి సుమారు నాలుగు వేల కోట్లని ఓ అంచనా. సౌండ్‌ప్రూఫ్ బంబార్డర్ విమానం అనిల్ అంబానీ కంటే ముందే కొన్నాడు.

బి.జి.టి. ఎదురుగా ఉన్న యువకుడి పేరు అభినయ్. అతడి వయసు ఇరవై అయిదు కానీ ఓ పదేళ్ళు ఎక్కువ కనబడుతోంది.

కొద్ది సేపటి క్రితమే అతడు బి.జి.టి. ని చంపబోయాడు. అభినయ్ చేతిలోని నైన్ ఎం.ఎం. పిస్టల్ ఛాంబర్‌లోని బుల్లెట్ జామ్ కావడంతో బి.జి.టి. బతికిపోయాడు. అతడు పిస్టల్ కాక్ చేసేలోపు బి.జి.టి. కాలు వేగంగా అభినయ్ చేతిని తాకటం, పిస్టల్ ఎగిరి పడటం జరిగి పోయాయి.

బి.జి.టి. పర్సనల్ గార్డ్స్ అభినయ్‌ని పట్టుకున్నారు. బి.జి.టి. వారించకపోయి ఉంటే వాళ్ళ చేతిలోని వాల్తర్ పిస్టల్స్ అభినయ్ శరీరంలోకి పది బుల్లెట్లు పంప్ చేసి ఉండేవి.

''ఫ్రిస్క్ హిమ్ .. అండ్ .. సెండ్ హిమ్ టు మై బార్ రూమ్. ఐ వాన్టు టాక్ టూ హిమ్'' అని బి.జి.టి చలసాని తన బార్ రూమ్‌కి వెళ్ళిపోయాడు.

అతడి బార్‌లో ఉన్న స్కాచ్ ఖరీదు కొన్ని లక్షలు ఉంటుంది. గ్లెన్ ఫామిలీ రేర్ కలెక్షన్ సింగిల్ మాల్ట్‌ని తన గ్లాసులోకి వంపుకున్నాడు. ఆ బాటిల్ ఖరీదు ఎనిమిది లక్షలు. గ్లెన్ బ్రువరీస్ ప్రీమియం కస్టమర్స్‌కి అమ్మే స్కాచ్ అది. దాని మీద ప్రింటెడ్ లేబుల్ ఉండదు. చేతితో రాసిన లేబుల్ ఉంటుంది. గ్లాసులోని స్కాచ్‌లో రెండు ఐస్ క్యూబ్స్ వేసుకుని అవి కరగటం కోసం చూస్తూ

''విల్ యూ కేర్ ఫరే డ్రింక్?'' అని

తనని చంపడానికి వచ్చిన వాడితో టీవీ కార్యక్రమంలో ఇంటర్వ్యూ తీసుకుంటున్నట్టు తాపీగా అడిగాడు బి.జి.టి.

'నాకు మంచినీళ్ళు కావాలి' అన్నాడు అభినయ్.

మరుక్షణం అతడి ముందు గ్రీన్ లాండ్ నుండి

ఇంపోర్టయిన ఐస్‌మెల్డ్ వాటర్ బాటిల్ ఖరీదయిన బెల్జియం గ్లాసులో ఉంది.

అతడి దాహం తీరేక, తన విస్కీ ఒక్క సిప్ చేసి నవ్వుతూ అడిగాడు బి.జి.టి.

"చెప్పు ... నన్నెందుకు చంపాలనుకున్నావ్?" అని

***

అది పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ పచ్చని పల్లెటూరు. పేరు ఇరగవరం.

ఆ ఊళ్ళో సావిత్రి అనే అమ్మాయి తన భర్తతో, ఓ కొడుకు, కూతురుతో ఆర్థిక ఇబ్బందులున్నా సంతోషంగానే కాపురం చేసుకుంటోంది.

సావిత్రి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వాళ్ళు ఓ రెండు వేల రూపాయలు, ఓ సైకిలూ కట్నంగా ఇచ్చి, ఇంటర్ చదివిన సావిత్రికి పెళ్ళి చేశారు.

సావిత్రి మొగుడు పెనుగొండ రైసుమిల్లులో పని చేసే వాడు. బియ్యం బస్తా లారీలోకి లోడింగ్ చేసేటప్పుడు ఆ ఊపులో ఏదో తేడా వచ్చి నడుం పట్టేసింది.

కాలవొడ్డునున్న డాక్టర్ రామచంద్రరాజు ఎమ్డీ గారికి చూపించారు. ఆయన నొప్పికి మందులిచ్చి కొన్ని నెలలు కదలకుండా పడుకుంటే గానీ వెన్నుముక సర్దుకోదని చెప్పారు.

మొగుడు మూలన పడటంతో సావిత్రి కూలియే ఆ ఇంటికి ఆధారమయింది. పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. ఇటు తగ్గిన రాబడి, అటు పెరిగిన ఖర్చులు. అప్పుడు ఇరగవరానికి వచ్చారు మైక్రోఫైనాన్స్ వాళ్లు.

సావిత్రి ఉన్న పేటలో నలుగురు చొప్పున ఒక్కో గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ నలుగురూ ఒకరికి, ఒకరు గారంటీ. పొలం, బంగారం ఏమీ తనఖా పెట్టనక్కర్లేదు. కేవలం ఒకరికి ఒకరు గారంటీ మీద తలా ముప్ఫై వేలు లోను శాంక్షన్ కావటం, సంతకాలు, వేలిముద్రలూ పడిపోవటం, వీళ్ళ చేతిలో తలా పాతికవేలు వాలిపోవటం మెరుపు వేగంతో జరిగిపోయాయి. అయిదువేలు కంపెనీ వాడు ముందే మినహాయించుకున్నాడు. అప్పు మాత్రం ముప్ఫైవేలే లెక్క.

ఊళ్ళో తమ కులానికి గానీ, మనుషులుగా తమకి గానీ లేని విలువ మైక్రో ఫైనాన్స్ వాళ్ళ దగ్గర చూసి దంగైపోయారు పేటలోని జనం.

సావిత్రి కూడా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులో చేరి పాతిక వేలు తీసుకుంది.

ఓ ఐదువేలు సుమారు భర్త వైద్యానికి పోయింది. పదిహేను వేలుపెట్టి పెనుగొండ పశువుల సంతలో ఓ గేదెను కొంది.

మిగిలిన ఐదువేలతో పిల్లలు గొడవ చేస్తే ఓ కలర్ టీ.వీ. కొన్నది పెనుగొండ అది సూర్యా ఎలక్ట్రానిక్స్‌లో.

కూలీకెళ్ళడం మాని గేదెని మేపటం, అదిచ్చే పాలు ఊళ్ళో వాడకాలకి పోయటం మొదలు పెట్టాక సావిత్రి పని బావుంది.

అయితే ఇది కొంత కాలమే.

మూడు నెలలు గడిచేసరికి గేదెకేదో జబ్బుచేసి పాలు కొంచెం పసుపు రంగులో రావటమూ, కొంచెం వాసన రావటమూ మొదలైంది.

దాంతో వాడకాలు పోయాయి. తర్వాత గేదె పాలివ్వటం మానుకుంది. పశువుల డాక్టరుకి చూపిస్తే మందులు రాశాడు. వ్యాధి మానడానికి కొన్ని నెలలు పడుతుందన్నాడు.

అటు చూస్తే మూలన పడ్డ భర్త, ఇటుచూస్తే గొడ్డుబోయిన గేదె.

పొలం పనికి వెళ్దామంటే విపరీతమైన వాన లొచ్చి పొలాలు నిండా మోకాళ్ళలోతు నీళ్లు.

ఆ నీళ్ళు అడుగున ఎక్కడో వరి.

వారానికి ఆరువందల చొప్పున అరవై వాయిదాల్లో మైక్రో ఫైనాన్సు వాడి రుణం తీర్చాలి. అవికాక అదని, ఇదనీ పైన ఇంకో యాభై, అరవై గుంజుతానే ఉంటాడు.

బకాయి కట్టలేకపోయింది సావిత్రి. దాంతో మైక్రో ఫైనాన్స్ వాడు సావిత్రి గ్రూపులో మిగతా ముగ్గుర్నీ కట్టమని గొడవ మొదలెట్టాడు.

వాళ్ళ గొడవ పడలేక సావిత్రి చుట్టు పక్కలే ఉండే ఆ ముగ్గురు గ్రూపు మెంబర్లూ సావిత్రిని రాచి రంపాన పెట్టడం మొదలెట్టారు.

"నువ్వు కట్టలేకపోతే మేం కట్టాలి. నువ్వేం చేస్తావో మాకు తెలీదు. కట్టంతే" అన్నారు.

"అదేంటక్కా.... ఉంటే కట్టనా? అమ్ముదామంటే గేదెతో సహా నా ఇంట్లో అమ్ముడయే సరుకే లేదు" అంది సావిత్రి.

"అయితే టీవీ అమ్ము" అన్నారు.

"పిల్లలు ఉసూరు మంటారక్కా" అంది సావిత్రి.

అయితే అప్పు తీర్చాలంటే ఏం చెయ్యాలో మైక్రో ఫైనాన్సు వాడే చెప్పాడు.

"దీనికి రెండు మార్గాలున్నై ... ఒకటి నువ్వు వయసులో ఉన్నావు, ఆడదానివి కనుక పెనుగొండ లోనో, తణుకులోనో ఉన్న బ్రోకరుకి చెప్తాను. కాసేపు కళ్ళు మూసుకుంటే మా మైక్రో ఫైనాన్సు బాకీ తీర్చవచ్చు, నీ ఇల్లు జరుపుకోవచ్చు అన్నాడు.

ఇదే మాట సావిత్రి అమ్మతో అంటే చంపేసేదే, ఆ తరంలో టీవీ లేదు. కానీ సావిత్రి డైలీ సీరియల్స్‌లో అక్రమ సంబంధాలు రోజూ చూసి చూసి నార్మలైజేషన్ స్థాయికి వచ్చింది.

"ఛీ .. ఛీ .. దాని కంటే చావటం మేలు" అంది. కానీ అందులో కోపం చాలా తక్కువ స్థాయిలో ఉంది.

"అది కూడా మంచిదే ... పడుపు వృత్తి తప్పు అనుకుంటే... చచ్చిపో .. నువ్వు చనిపోతే మీ కుటుంబానికి కొంత డబ్బు కూడా ఇస్తాం ... పైగా నీ మొగుడు కానీ, పిల్లలు గానీ బాకీ తీర్చనవసరం లేదు" అన్నాడు మైక్రో ఫైనాన్స్ ఏజంట్.

అతడు మాట్లాడేది అర్థం కావటానికి చాలా టైం పట్టింది సావిత్రికి.

ఇది జరిగిన వారంలోపే సావిత్రి శవం మార్టేరు లాకుల దగ్గర తేలింది.

పెనుగొండ సీతారామపేటలో వ్యభిచారం చేస్తున్న ఆమె దగ్గరికి వచ్చిన ఓ విటుడు ఆమెను గుర్తుపట్టి ఆశ్చర్యపోయాడు. ఆమె భర్తతో పాటు మిల్లులో పనిచేసేవాడు అతడు. అప్పుడప్పుడూ భర్తతో పాటు ఇంటికి భోజనానికి కూడా వచ్చేవాడు.

"నిన్ను ఇక్కడ చూడాల్సొచ్చిందా అమ్మా ... ఏదైనా ఆపదొస్తే చెప్పుకుందుకు, చేయగలిగింది చేసేందుకు మేం బతికున్నాంగా తల్లీ అన్నాడు"

అక్కడ్నించి తీసుకొచ్చి భద్రంగా షేర్ ఆటోలో ఎక్కించాడు.

తట్టుకోలేక పోయింది సావిత్రి.

ఆటో పెద్ద వంతెన దాటాక దిగిపోయి వెనక్కి వచ్చింది. వంతెన మీంచి దూకేసింది.

***

"నీ వల్ల ఓ సంసార స్త్రీ, పిల్లల మొహంలో సంతోషం చూసేందుకు తపించే ఓ తల్లి, భర్తని తల్లిలా చూసుకున్న ఓ భార్య ... ముందు వ్యభిచారిగా మారింది. .. తర్వాత చచ్చిపోయింది. ఆ పిల్లలు తల్లిలేని వాళ్ళయ్యారు.. చాలా మంది స్త్రీలు నీ మైక్రో ఫైనాన్సు ఉచ్చులో, రొచ్చులో పడి మీరు చూపించిన దారిలో పతనమైపోయి వేశ్యలవుతున్నారు, లేదా ఉసురు తీసుకుంటున్నారు

... అందుకే నిన్ను చంపుదామని వచ్చాన్రా లంజా కొడకా" అన్నాడు అభినయ్.

బి.జి.టి. కొంత డిస్టర్బ్ అయినా తమాయించుకున్నాడు.

"చూసేవా ... నీలాంటి వాడు కూడా నన్ను తిట్టాలంటే ముందు ఓ స్త్రీని అవమానించిగానీ ఆపని చెయ్యలేకపోతున్నాడు" అన్నాడు.

"అల్లూరి సీతారామరాజు పుట్టిన జిల్లా కదా ... అందుకే మీకు ఆవేశం ఎక్కువ. కానీ సమస్యకి పరిష్కారం నన్ను చంపటం మాత్రం కాదు. ఒక్క సీతారామరాజు చనిపోతే ఆ నెత్తుర్నించి వందల రామరాజులు ప్రభవిస్తారన్నాడు ఆయన రూదర్‌ఫర్డ్‌తో.

కానీ సీతారామరాజు ఒక్కడే చరిత్రలో. కానీ నన్ను చంపితే మరొకడొస్తాడు. అసలు మైక్రో ఫైనాన్సు కాన్సెప్టు కనిపెట్టిన యూనిస్ కి నోబుల్ ప్రైజు వచ్చింది తెలుసా" అన్నాడు బి.జి.టి.



## మన వంటలంటే పిచ్చి....

తొలి సినిమా 'ఝుమ్మందినాదం'తో సినీ అభిమానుల మనసు దోచుకున్న తాప్సీకి ఇండియన్ రుచులంటే తగని పిచ్చి అట! ఇదే విషయాన్ని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది."సినిమాల్లోకి రాకముందు నేను మంచి భోజనప్రియురాల్ని. భారతీయ వంటకాల్లో అన్ని వెరైటీలు నాకు ఇష్టమే! ముఖ్యంగా పంజాబీ రుచులంటే మరీ మరీ ఇష్టం! అప్పుడు డైటింగ్ గొడవ ఉండేది కాదు కాబట్టి అన్నీ తినేసేదాన్ని! ఇప్పుడు అలా తినడం కుదరడం లేదు. అయినా అప్పుడప్పుడు ఆ నిబంధనని సడలించి నచ్చినవి లాగించేస్తుంటాను. చాలా మంది ఇష్టపడినట్లే నేను కూడా కాటన్ అవుట్‌ఫిట్స్ అంటే ఇష్టపడతాను."

''తెలుసు అది కూడా శాంతి బహుమతి. కోట్ల కాపురాల్లో చిచ్చు పెట్టినందుకు శాంతి బహుమతి. మరొక లోఫర్‌కి టైమ్ మాగిజన్ అవార్డు కూడా వచ్చింది. పెట్టుబడిదారీ దేశాలు ప్రజల రక్తం తాగే వాడి సామర్థ్యానికి గుర్తుగా, మెప్పుగా ఇచ్చిన అవార్డులవి'' అన్నాడు అభినయ్.

''నువ్వు సావిత్రి కథలో ఎవరివి ? నా ఊహ కరక్టయితే నీకు ఆమెతో ఏ సంబంధం లేదు. కేవలం జరిగింది చూసి స్పందించి నన్ను చంపబోయి ఉంటావు.

నీలాంటి మనిషిని చూసినందుకు గర్వంగానూ, వ్యవస్థ పుట్టించిన నన్ను చంపితే ఇది ఆగుతుందన్న నీ అజ్ఞానం చూస్తే బాధగానూ ఉంది.

మేం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్ కింద నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్‌గా రిజిస్టరయ్యాం. చట్ట విరుద్ధంగానో, చట్టం కళ్ళు కప్పో ఏమీ పని చెయ్యటం లేదే.

రెండోది పావలా వడ్డీ అంటే నూటికి మూడు శాతం వడ్డీకి ప్రభుత్వం లోన్లు ఇస్తుంటే నేను ఇరవై ఎనిమిది నుండి యాభై శాతం వరకూ వడ్డీ వసూలు చేస్తున్నాను. క్రెడిట్ కార్డు రేటాఫ్ ఇంట్రస్టు కన్నా ఇది పది శాతం కనీసం ఎక్కువ.

అయినా కూడా ప్రజలు నావెంటే ఎందుకు పడుతున్నారు?

ఒక్కసారి వెళ్ళి బ్యాంకుల ముందు పడిగాపులు పడుతున్న వాళ్ళని అడుగు ఎవరు ప్రజలకి దగ్గరో.

లోను ఇవ్వడం వరకే నా బాధ్యత. అది ఎలా వాడుకోవాలి, ఎలా వృద్ధిలోకి రావాలి అనేది ఆ పర్సన్ కాపబిలిటీ మీద, బిజినెస్ సెన్స్ మీద ఆధారపడి ఉంటుంది.

అది విద్యా వ్యవస్థ బాధ్యత. నా బాధ్యత కాదు.

నువ్వు చెప్పిన సావిత్రి జీవితంలోనే చూడు, టీవీ అనేది అన్‌ప్రొడక్టివ్, టైమ్ కిల్లింగ్ వేస్ట్ ఆఫ్ మనీ. ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్న వాడికి కూడా ప్రొడక్టివ్, అన్‌ప్రొడక్టివ్ ఎక్స్‌పెండేచర్ ఏమిటో చెప్పని చదువు మనది.

సావిత్రి టీవీని, గేదెని వదిలించుకుంటే ఎంతో కొంత నష్టానికి మరో రెండు నెలల టైం దొరికేది.

ఈలోగా పొలం పనులు మొదలయ్యేవి. ఆడవాళ్ళకి కోస్తా ఆంధ్రలో రోజు కూలీ రెండొందలు. మూడు రోజుల కూలీతో నా బాకీ తీర్చి మిగతా వాటితో తన కుటుంబాన్ని పోషించుకోవచ్చు. కాదంటావా?

అవాక్కయి చూస్తున్నాడు అభినయ్.

''నేనూ నీలాగే .. నీ కంటే పెద్ద కమ్యూనిస్టుని, ఒకప్పుడు. నా పేరు చలసాని బాల గంగాధర తిలక్. మా నాన్న పేరున్న రిఫార్మిస్టు. ఓ యస్.జి.ఓ తో నా జీవితం మొదలైంది. వ్యవస్థ మీద తిరగబడ్డ వాణ్ణి ఈ వ్యవస్థ ఎలా కాలరాస్తుందో, అణిచేస్తుందో చూశాక పోరాటం వదిలి మైక్రో ఫైనాన్స్ దారి తొక్కాను. సంపద పెరగాలి, ప్రజలు సుఖపడాలి అనేది నా ఫిలాసఫీ. కానీ ఇంప్లిమెంటేషన్లో ఇబ్బందులుండొచ్చు.'' అన్నాడు తిలక్ విస్కీ తాగుతూ.

''ఓహో ... నీ సంపద పెరిగింది ... అది నిజం ... దాన్లో ఇబ్బందులు లేవు'' ... నీకు జీవితం లోతు, పోరాటంలో ఇబ్బందులూ తెల్సి కమ్యూనిస్టు కాస్తా, దోపిడీదారుగా మారావన్నమాట...'' వ్యంగ్యంగా అన్నాడు అభినయ్.

కొంచెం ఆగి

'కాలిక్యులేషన్లు కాకుండా నీకెంత కమ్యూనిజం తెలుసో కొంచెం వినాలనుంది'' అన్నాడు అభినయ్. అదే వెటకారాన్ని కంటిన్యూ చేస్తూ.

''అగ్గిపుల్లా , సబ్బుబిళ్ళా, కుక్కపిల్లా కాదేదీ కవితకనర్హం అన్నాడు శ్రీశ్రీ ... దాని లోతు తెలీనివాడు ఆ శబ్దానికి ఆనందించవచ్చు. మిడిమిడి జ్ఞానం ఉన్నవాడు దాన్ని కోట్ చేసి చప్పట్లు కొట్టించుకోవచ్చు. కానీ నాకేం తెల్సో చెప్తాను.

అగ్గిపుల్ల అన్నాడు కవి. అంటే దాని తయారీ వెనుక ఉన్న కథ, వ్యధ తెల్సుకోమని. ఒక్క తమిళనాడులోని శివకాశిలోనే పదివేల మంది బాల కార్మికుల జీవితాలు అగ్గిపుల్లల తయారీలో కాలిపోతున్నాయి. ఇరవై మిలియన్ల నుండి యాభై మిలియన్ల బాల కార్మికులు మన దేశంలో ఉన్నారు. వాళ్ళ జీవితాల్లో ఆట పాటలు లేవు. బాల్యం దహనమవుతోంది.

సబ్బుబిళ్ళ ... ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్ కంపెనీ తన 23 బ్రాండ్లతో సంవత్సరానికి చేసే వ్యాపారం నలభై నాలుగు వేల కోట్ల రూపాయలు ..... మన వంటి మీద గబ్బు వాడికి సిరులు కురిపిస్తోంది. ఇంత సొమ్ము ప్రజలు కేవలం తమని తాము శుభ్రంగా ఉంచుకోవడానికి పెట్టాలా?

కుక్కపిల్ల ... ఈ సమాజంలో కుక్కల్ని ఇళ్ళలోకి రానిస్తారు. ఎత్తుకుంటారు.. కానీ సాటి మనుషులైన దళితుల్ని తాకరు ... ఇంతకంటే అమానుషం ఉందా?...

అందుకే శ్రీశ్రీ గొప్ప కవి అయ్యాడు. నాకు లోతు తెల్సు .... సమాజం పట్ల బాధ్యత తెల్సు ... కానీ భయపడ్డాను. వ్యవస్థకీ, సమాజానికీ భయపడ్డాను. ఇందాక చెప్పినట్టు నా కంటే ముందు వ్యవస్థ మీద తిరగబడ్డ వాళ్ళకి పట్టిన గతి చూసి భయపడ్డాను.

''నేను పాపులర్ తెలుగు రైటర్‌ని కాను. అడ్డమైన పనులూ చేసి, అడ్డమైన రాతలూ రాసి అడ్డగోలు లాజిక్‌తో సమర్థించుకోవడానికి. చట్టం, న్యాయం కాకుండా ధర్మం అనేది ఒకటుంది. తప్పు, ఒప్పు అనేవి ఉన్నాయి.

నాకు తెల్సి జరిగినా, నేను చెప్పక జరిగినా మైక్రో ఫైనాన్స్ రాక్షస చక్రాల కింద బతుకులు నలిగిపోతున్నది నిజం. దానికి నా బాధ్యత నిజం. నాకు క్రెడిట్ ఇన్సూరెన్స్ ఉంది. వాళ్ళ చావుకి వాళ్ళతోనే ప్రీమియం కట్టించి వాళ్ళ చావు నుండి కూడా లాభం పిండుకుంటున్నాను.

సరే ... ఓ పని చేద్దాం ...

వెయ్యి కోట్లతో ఓ ఫౌండేషన్ పెడతాను. నువ్వు దానికి చీఫ్‌గా ఉండు. ప్రజల్ని ఎడ్యుకేట్ చెయ్యి. దోపిడీ గురించి చెప్పు. వాళ్ళకది అవసరం. అలాగే డబ్బు సంపాదించడం, సంపాదించిన దాంతో సంతృప్తిగా ఉండటం నేర్పు ... నా వల్ల జరిగిన తప్పులకి అదో పరిహారం అనుకుంటాను.

నిన్నే ఎందుకు అడుగుతున్నానంటే మార్కెట్లో డబ్బుకి సామర్థ్యం దొరుకుతుంది, నిజాయితీ కాదు.

జీవితం చాలా చిన్నది. డబ్బుకి విలువ దాన్ని కూడబెట్టినప్పుడు కాదు ... సమాజానికి ఉపయోగపడినప్పుడే. డబ్బు ఎరువులాంటిది. పోగుజేస్తే కంపు కొడుతుంది. జల్లితే జనంలో పెరుగుతుంది అన్నాడు జె.ఆర్.డి.టాటా. నా దగ్గర కంపు కొట్టేంత డబ్బుంది. పెళ్ళాలకి విమానాలు, ఓడలూ కొనడం కన్నా ఇది మంచి ఖర్చని అనుకుంటున్నా ....'' నవ్వాడు తిలక్ ....

అభినయ్ అతడివేపు అలా చూస్తూ ఉన్నాడు.

''ఈ పని ముందే ... అంటే ఈ దోపిడీ మైక్రోఫైనాన్స్ పెట్టడానికి ముందే చేసుంటే బావుండేది కదా?'' అన్నాడు అభినయ్.

''అప్పుడు నేను మేకని ... వ్యవస్థ నన్ను బలి తీసుకునేది. నిన్ను కూడా తీసుకుంటుంది, నీ వెనక నే లేకపోతే. నేనిప్పుడు పులిని. డబ్బు చారలున్న పులిని. మేకల్నే బలివ్వగలరు కానీ పులిలాంటి బలమైన జంతువుని కాదు. అందుకే ముందు పులిగా మారమన్నాడు బాబా సాహెబ్ అంబేద్కర్ ... చెప్పు పులిగా వేటకు వెళ్తావా ... ? ఓ చానెల్ పెట్టు .... ఎడ్యుకేట్ చెయ్యి.... ఎవరికీ రాని చాన్స్ నీ కొచ్చింది. సమాజానికి ఉపయోగపడతావా లేక ఇలా నాలాంటి ఒకరిద్దర్ని చంపి ... నువ్వా దిక్కుమాలిన చావు చస్తావా?

సతీష్ చందర్ అన్నట్టు రండి జాకీలు పట్టుకుని
బోధివృక్ష సమూహాల క్రిందకు రండి
ఎగరలేని వాళ్ళను పైకెక్కిద్దాం
వృద్ధుల్ని సైతం బుద్ధుల్ని చేద్దాం
ఏదయినా అంతే
బతకడం బద్ధకిస్తే
వయస్సు మీద పడుతుంది.

ఛాయిస్ ఈజ్ యువర్స్.

*

రచయిత సెల్: **9494442349**

## నేను - నా నీడ

పుట్టింది మొదలు
నా ప్రయాణం మరణం వైపే
ఈ నిజం తెలిసినా
చావటం అంటే ఎవరికీ ఇష్టముంటుంది?
వాస్తవం రుచిగా ఉండదు
మరణాలు, అంత్యక్రియలు
బాల్యంలో చిక్కువీడని పజిల్స్
కాలసూత్రం దారి పొడుగునా
వేలాడే మృత్యువుని చూసినప్పుడు
పారి పోవాలనే విఫలయత్నం
యవ్వన కథల్లో దాని ఊసుండదు
వృద్ధాప్యం గంట మోగేదాకా
గుర్తురాదు
ఒక అనారోగ్య అనుభవం
ఒక నిరాశా సంఘర్షణ
వైఫల్యం... వైరుధ్యం
మిగిల్చేది అదే స్పృహ!
ఎవరికయినా
పుట్టకముందు 'నేను'
ఎక్కడ
పుట్టాక అంతా 'నేనే' కదా!
ముందు వెనుక ఒక తరానికి తప్ప
నామ రూపాలు లేని జీవితంలో
నిరంతరం నీడలా వెంట నడుస్తూ
'నేను' లేనప్పుడు కూడా
తోడుగా మిగిలే నీడని తల్చుకుంటే
అంతులేని నిశ్చింత



–డా. సి.భవానీదేవి
**9866847000**